RNI AP BIL14872/2024

# ఇర్రిపాక శివకేశవుల దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ గా జ్యోతుల మణమ్మ

### 38 మందితో నూతన అభివృద్ధి కమిటీ ఏర్పాటు - సెప్టెంబర్ 2న తొలి అభివృద్ధి కమిటీ మీటింగ్



జగ్గంపేట, ఆగస్టు 30 జివిస్బి వార్త : జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్ల శివకేశవుల క్షేత్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ గా జగ్గంపేట శాసనసభ్యులు, దేవస్థానం వ్యవస్థాపకులు జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతుల మణమ్మ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులుగా 38 మందిని నియమించారు. సెప్టెంబర్ 2వ తేదీన మొదటి అభివృద్ధి కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఎన్నిక అనంతరం జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఇర్రిపాక శివకేశవుల క్షేత్రాన్ని దక్షిణ భారతదేశంలోనే ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ కమిటీని ఏర్పాటు చేశామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, ఆలయ అభివృద్ధి, ఏలేరు తీర సుందరీకరణ, నిత్య అన్నదానం, ధూపదీప నైవేద్యాలకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపడతామని అన్నారు.

నూతనంగా ఎన్నికైన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల వివరాలు:

1. జ్యోతుల మణి గారు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇర్రిపాక 2. జ్యోతుల నాగబాబు 3. పంతం సత్యనారాయణ 4. జ్యోతుల వీరభద్రరావు 5. దొడ్డిపట్ల నాగేంద్ర కుమార్ ( బుజ్జి) 6. కొండ్రపు లక్ష్మణరావు 7. పంతులు పండు 8. సుర్ల రమణ 9. నెల్లూరి అచ్చారావు 10. పప్పల నూకరాజు11. ఉప్మాక వీరబాబు 12. అడ్డాల రాంబాబు 13. పల్లి అచ్చారావు 14. కేశినీడి బుజ్జి 15. మాగాపు ఆంజనేయులు 16. వడ్డీ సుజాత 17. గెద్దం మంగ తాయారు 18. బలబద్రుని శిరీష 19. అరవాల అప్పలరాజు 20. పిండి శివ 21. జ్యోతుల జయ బాబు 22. తిర్రి రాజ 23. కంబాల నాగేశ్వరరావు 24. కేసినీడి అప్పారావు 25. గండేపల్లి నాగభూషణరావు 26. అనిమిరెడ్డి నాగేష్ బాబు 27. పి.ఏ. బుజ్జి 28. లింగంపర్తి - కురివెళ్ల రాజు 29. మామిడాడ - బొడ్డేటి సుమన్ 30. నరేంద్ర పట్నం- ఉంగరాల శివ వీర లోవరాజు 31. భావారం - కంచి కృష్ణార్జున 32. మర్రిపాక - బండారు చిన్న బాబు 33. జగ్గంపేట - తులా రాము 34. జగ్గంపేట - మానేపల్లి బంగార్రాజు 35. సోమవారం- జంపన రవి వర్మ 36. కృష్ణవరం- బోదిరెడ్ల సుబ్బారావు 37. బూరుగుపూడి - కుంచే తాతాజీ 38. తిరుమాలి - పసల సూరిబాబు ఇరిపాక శివ కేశవుల క్షేత్రం అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.

# రాజమండ్రిలో శ్రీకరం సప్లై కంపెనీ నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన కంబాల



రాజమహేంద్రవరం ఆగస్టు 30 జి ఎస్ బి వార్త : తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి స్టేడియం రోడ్డులోని కోట అయ్యప్పకి చెందిన శ్రీకరం సప్లై కంపెనీ నూతన వ్యాపారాన్ని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు గారు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు గారు షాప్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. షాప్ యజమాని కోట అయ్యప్ప దంపతులు కంబాల శ్రీనివాసరావు గారి ఆశీస్సులు తీసుకున్నారు నూతన వ్యాపారం విజయవంతంగా కొనసాగి, మంచి ఆదరణ పొంది, మరింత విస్తరించాలని కంబాల శ్రీనివాసరావు గారు ఆకాంక్షించారు. అనంతరం శ్రీకరం సప్లై కంపెనీ యాజమాన్యం, కంబాల శ్రీనివాసరావు గారిని శాలువ కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామసేన సిబ్బంది, బీజేపీ నాయకులు కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు

# గోకవరం టీడీపీలో మరో రాజీనామా

### అనివార్య కారణాలతో పార్టీ సభ్యత్వానికి చల్లా రాజ్యలక్ష్మి గుడ్‌బై.



గోకవరం ఆగస్టు 30 జి ఎస్ బి వార్త : గోకవరం మండల తెలుగుదేశం పార్టీలో రాజీనామాల పరంపర కొనసాగుతోంది. తాజాగాకొత్తపల్లి గ్రామానికిచెందినచల్లారాజ్యలక్ష్మి టీడీపీపార్టీసభ్యత్వానికిరాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గోకవరం టీడీపీ మండల అధ్యక్షులు పిల్లా చంటిబాబుకు తన రాజీనామా లేఖను సమర్పిస్తూ, కొన్ని అనివార్య కారణాల వల్ల పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన రాజీనామా అభ్యర్థనను స్వీకరించాలని ఆమె లేఖలో కోరారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మి పార్టీకి రాజీనామా చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే మండలంలో పార్టీకి సంబంధించిన పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్న నేపథ్యంలో తాజాగా మరో సభ్యురాలు రాజీనామా చేయడం టీడీపీ శ్రేణుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆమె భవిష్యత్ రాజకీయ నిర్ణయం ఏమిటన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# పెంచిన నిత్యవసర ధరలు తగ్గించాలి.




పెంచిన నిత్యవసర- అత్యవసర ( బియ్యం, నూనె, పప్పులు, మొదలైన )ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నాడు గోకవరం మండలం రంప యర్రంపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కూలి పనులు లేక రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు నిత్యవసర వస్తువుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నాయని ఆయన విమర్శించారు. నిత్యాసర వస్తువుల ధరలు పెరిగిపోయి పేదలు ఒక పూట పస్తులు ఉండి, ఒక పూట తింటూ జీవనం సాగిస్తున్నారని ఆయన తెలిపారు. అటు వర్షాలు లేక, పంటలు పండక రైతులు తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిపోతున్నారని, రైతులకు సకాలంలో నీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. నిత్యవసర- అత్యవసర ధరలు ఇలాగే ఉంటే కరువు తప్పదని ఆయన తెలిపారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల మా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కే. సతీష్, గోలి మునలయ్య, చింతపల్లి మునలయ్య, నరసమ్మ, వీర రాఘవ, లక్ష్మి, కాసులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో తెలంగాణతో సహా 175 నియోజకవర్గం లో డిప్యుటీ సీఎం పవన్ కళ్యాణ్

### సెప్టెంబర్ 2న జనసేన యువజన విభాగాలు ఆవిష్కరణ

మంగళగిరి (జిఎస్ బి వార్త) - 175 నియోజక వర్గాలలో ఘనంగా కార్యక్రమం నిర్వహణ- ?తెలంగాణతో సహా పలు రాష్ట్రాల్లో కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు జనసేన పార్టీ యువజన విభాగాన్ని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో ఆవిష్కరించనున్నారు. పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 11 గంటలకి యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమాన్ని జన సైనికులు, వీర మహిళలు, నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ , రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ గారు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఆ రోజు యువజన విభాగం లోగో, గీతాన్ని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆన్ లైన్ ద్వారా పార్టీ శ్రేణులకు సందేశం ఇస్తారు. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం కేరళలో చికిత్స తీసుకొంటున్న సంగతి విదితమే. యువజన విభాగం ఏర్పాటు ఉద్దేశం, విభాగం లక్ష్యాలు, యువతలో రాజకీయ చైతన్యం తదితర అంశాలపై దిశానిర్దేశం చేస్తారు. యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తెలంగాణతో సహా పలు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# కూటమి పాలన లో అర్హులందరికీ పింఛన్లు

### మాజీ ఎమ్మెల్యే అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి



కరప, ఆగస్టు 30:(జిఎస్ బి వార్త) : కరప మండలం నడకుదురు గ్రామంలో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి, సత్యనారాయణ మూర్తి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మేలు చేయడమే ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ నాయకత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ ల భాగస్వామ్యంతో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని, అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తోందని తెలిపారు. గత 35 రోజులుగా పర్యటిస్తున్న సమయంలో గ్రామాల్లో అనేకమంది పింఛన్లు అందడం లేదని తమ దృష్టికి తీసుకువచ్చారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, గ్రామ సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాలు, వార్డుల్లో సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని, అక్టోబర్ 1వ తేదీ నుంచి నూతన పింఛన్లు మంజూరయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ఇళ్ల స్థలాల నిధులను విడుదల చేయించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని, నియోజకవర్గ పరిధిలోని సమస్యలన్నింటినీ స్థానిక జనసేన ఎమ్మెల్యేతో కలిసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, మాజీ జడ్పీటీసీలు నులుకుర్తి వెంకటేశ్వరరావు, బుంగా సింహాద్రి, క్లస్టర్ ఇన్చార్జిలు మద్దూరి స్వామి, గండి వెంకటేశ్వరరావు కాకినాడ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవు వెంకన్న, వాణిజ్య విభాగం కార్యదర్శి చీపురుపల్లి జయేంద్రబాబు, ఐటీడీపీ కాకినాడ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి గుబ్బల ప్రసాదరావు, గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు యాసలపు విష్ణుమూర్తి, పోతల గోవిందు, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ వై. వీరేంద్ర కుమార్, అనిమిరెడ్డి వెంకటరమణ, బండారు గోవిందు, సింగంపల్లి నాగేశ్వరరావు, సింగంపల్లి అప్పలనాయుడు, లోవరాజు, సిటిమిరెడ్డి నూకరాజు, ఎలగా లోవరాజు, కొమిరిశెట్టి నరసింగరావు, పంపన కన్నారావు, పులపకూర శుభ మహేష్, కోనా వెంకటలక్ష్మి, కానూరు సురేష్, రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, చాట్రు ఇమ్మానియేలు, తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా ఐ.పోలవరంలో మెగా రక్తదాన శిబిరం

### రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి -- నిర్వాహకుల పిలుపు



ఐ.పోలవరం, ఆగస్టు 30 (జియస్‌బి వార్త ): జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఐ.పోలవరం మండలంలో భారీ స్థాయిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐ.పోలవరం మండలం బాణాపురం సెంటర్‌లో, నివాస్ ఫౌండేషన్, రాయపురెడ్డి సత్య సిద్ధు ఆధ్వర్యంలో, జనసేన పార్టీ ఐ.పోలవరం మండలం సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తదానం ద్వారా అవసరంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు, పవన్ కళ్యాణ్ వీరాభిమాని, నివాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాయపురెడ్డి సత్య సిద్ధు మాట్లాడుతూ, జనసేన నాయకులు, జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు, వీర మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. "రక్తదానం చేయండి... ప్రాణదాతలుగా నిలవండి... పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో ఘనంగా జరుపుకుందాం" అంటూ పిలుపునిచ్చారు.

# ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు సెప్టెంబర్ 1న ఇంటి వద్ద పింఛను సొమ్ము పంపిణీకి చర్యలు..

**జిల్లాలో 2.65 లక్షల మందికి రూ.115.65 కోట్ల పింఛను సొమ్ము పంపిణీ కి పటిష్ట ఏర్పాట్లు..**

**తొలిరోజే నూరు శాతం పింఛన్ల పంపిణీకి అధికారులు కృషి చేయాలి.**

**సెప్టెంబర్ నెలలో 272 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరు..**

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్.**



కాకినాడ, ఆగస్టు 30:(జిఎస్ బి వార్త) : 2026 సెప్టెంబరు నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి కార్యక్రమాన్ని సెప్టెంబర్ 01న నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సామాజిక భద్రత కింద జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ లు 2026 సెప్టెంబరు నెల 1వ తేదీ అవ్వా తాతలకు, దివ్యాంగులకు,దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇతర పింఛనుదారులకు సొమ్ము పంపిణీ చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. 2026 సెప్టెంబరు నెలకు సంబంధించి కాకినాడ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద 2,65,439 మందికి రూ. 115.65 కోట్లు పంపిణీకి సర్వం సిద్ధం చేశామన్నారు. ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సెప్టెంబరు నెల 1 వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచే సచివాలయం సిబ్బంది పింఛను దారులకు తమ ఇంటి వద్దనే సొమ్ము అందజేయడం జరుగుతుందన్నారు. తొలి రోజే నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 2,65,439 పింఛనుదారులకు రూ. 115.65 కోట్లు ఎన్టీఆర్ భరోసా కింద సెప్టెంబర్ 1, మంగళవారం పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వివరించారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ సకాలంలో పంపిణీ పూర్తి చేసేలా అధికారులు.. కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని పింఛన్ల పంపిణీ విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

# అన్నపూర్ణ అమ్మవారికి వెండి మకర తోరణం బహుకరణ

పెద్దాపురం, ఆగస్టు 30, జి ఎస్ బి వార్త : పెద్దాపురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ దేవేరి అయిన అన్నపూర్ణ అమ్మ వారికి దాతలు ఇనుమర్తి సత్యనారాయణ, వీర వెంకట పద్మావతి దంపతులు లక్ష రూపాయలు విలువ చేసే వెండి మకర తోరణాన్ని బహుకరించారు. ఆదివారం ఆలయ కార్య నిర్వహణ అధికారి కే జగదీశ్వరరావుకు దాతలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో దాతలకు ఆలయ అర్చకులు స్వామివారు అమ్మవారి ప్రత్యేక దర్శనాన్ని చేయించి ఆశీర్వచనాలు అందజేశారు. అమ్మవారికి వెండి మకర తోరణం బహుకరించడంపై ఆలయ అధికారులు ధర్మకర్తల మండలి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.



# విలువ--అదనపు విలువ పుస్తక ఆవిష్కరణ

### వ్యవస్థ పతనానికి పెట్టుబడిదారీ సంక్షోభాలే కారణం - పి. భరత్




రామచంద్ర పురం (జిఎస్ బి వార్త) : రామచంద్ర పురం డా! చెలికాని రామారావు స్మారక మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విలువ--అదనపు విలువ పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు.

-- పి. భరత్, ఆర్థిక శాస్త్ర విశ్లేషకులు

రామచంద్రపురం స్థానిక చెలికాని రామారావు స్మారక భవనంలో డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ మార్క్సిస్ట్ విశ్లేషకులు శ్రీ రావు కృష్ణారావు రచించిన "విలువ--అదనపు విలువ" పుస్తక ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ సభకు చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ సభ్యులు డాక్టర్॥ సి. కృష్ణమోహన్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక శాస్త్ర విశ్లేషకులు పి. భరత్ మాట్లాడుతూ 2008 తర్వాత ప్రపంచం వ్యాప్తంగా వచ్చిన పెట్టుబడుదారి సంక్షోభాలు వల్ల ప్రజలు మార్క్సిస్ట్ సిద్ధాంతాలను అధ్యయనం చేస్తున్నారని అన్నారు. మార్క్సిస్ట్ సాహిత్యం పట్ల ఆకర్షితులవుతున్నారని. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏర్పడుతున్న ఆర్థిక సంక్షోభాలు ఆ వ్యవస్థలోని అంతర్గత వైరుధ్యాల ఫలితమేనని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులు తమ శ్రమశక్తిని విక్రయించి ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారు సృష్టించే మొత్తం విలువలో ఒక భాగమే వేతనంగా తిరిగి వస్తుందని, మిగిలిన అదనపు విలువ పెట్టుబడిదారుల లాభాలుగా మారుతుందని వివరించారు. ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతున్నప్పటికీ ప్రజల కొనుగోలు శక్తి అదే స్థాయిలో పెరగకపోవడం, నిరుద్యోగం, అసమానతలు, అప్పుల భారం, మార్కెట్ సంక్షోభాలు వంటి సమస్యలు పెట్టుబడిదారీ వ్యవస్థలోని వైరుధ్యాలను మరింత తీవ్రతరం చేస్తున్నాయని పేర్కొన్నారు. నేటి కాలంలో సాంకేతిక పరిజ్ఞానం, ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు వంటి కొత్త పరిణామాలు ఉత్పత్తి రంగాన్ని వేగంగా మారుస్తున్నాయని, అయితే ఈ సాంకేతిక అభివృద్ధి ద్వారా వచ్చే సంపద సమాజంలోని అందరికీ సమానంగా చేరడం లేదని అన్నారు. అందువల్ల "సంపదను సృష్టించేది ఎవరు? ఆ సంపదపై నియంత్రణ ఎవరిది? సృష్టించిన విలువలో కార్మికుడి వాటా ఎంత?" అనే ప్రశ్నలు నేటికీ ప్రాధాన్యత కలిగి ఉన్నాయని తెలిపారు. "విలువ--అదనపు విలువ" వంటి మార్క్సిస్టు రాజకీయ ఆర్థికశాస్త్ర గ్రంథాల అధ్యయనం ద్వారా యువత, విద్యార్థులు, కార్మికులు సమాజంలోని ఆర్థిక సంబంధాలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలని పి. భరత్ పిలుపునిచ్చారు. ఈ పుస్తక అధ్యయనం కేవలం మార్క్స్ సిద్ధాంతాన్ని తెలుసుకోవడానికే పరిమితం కాకుండా, వర్తమాన ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్న మార్పులను విశ్లేషించడానికి, సామాజిక అసమానతల మూలాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. నేటి వర్తమాన కాలంలో మార్క్సిస్ట్ విశ్లేషకులు శ్రీ రావు కృష్ణారావు రాసిన ఈ పుస్తకాన్ని అందరూ అధ్యయనం చేయాలని అన్నారు. దారి దీపం పత్రిక సంపాదకులు శ్రీ డి.వి.వి.ఎస్ వర్మ కి ఈ పుస్తకాన్ని అంకితమిచ్చారు. సభలో పలువురు మేధావులు, రచయితలు, విద్యార్థులు, యువత, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిస్వార్థ కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన బలం

### సొంత నిధులతో పార్టీ కార్యాలయం నిర్మించిన సూర్యవర్మ సేవలు అభినందనీయం -- ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు




ఐ. పోలవరం: ఆగస్ట్ 30( జియస్ బి వార్త) నిస్వార్థంగా పార్టీ కోసం పనిచేస్తూ ప్రజలకు సేవలందించే కార్యకర్తలు ఉండటమే తెలుగుదేశం పార్టీకి అసలైన బలమని ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) అన్నారు. ఐ. పోలవరం మండలం కొమరిగిరి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పెన్మెత్స సూర్యవర్మ, పార్టీపై తనకున్న అపారమైన అభిమానాన్ని చాటుతూ తన సొంత 20 సెంట్ల స్థలంలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. అదే ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహం, పార్టీ పతాక స్థూపాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ నూతన పార్టీ కార్యాలయం, ఎన్టీఆర్ విగ్రహం, పార్టీ పతాక స్థూపాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు పాల్గొని వాటిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, సూర్యవర్మ సొంత నిధులతో పార్టీ కార్యాలయాన్ని నిర్మించడం పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలు ఉండటం సాధారణ విషయమేనని, అయితే ఒక గ్రామ స్థాయిలో పార్టీపై ఉన్న అభిమానంతో సొంత స్థలాన్ని కేటాయించి, సొంత నిధులతో కార్యాలయాన్ని నిర్మించడం ఎంతో విశేషమన్నారు. సూర్యవర్మ తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ ఒకే చోట సమావేశమై పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేసుకోవడానికి ఇటువంటి కార్యాలయాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యకర్తల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ఇవి దోహదపడతాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమ లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల మద్దతు లభిస్తోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి కూటమి ప్రభుత్వానికి మరింత బలం చేకూర్చాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కొమరిగిరి గ్రామంలో సూర్యవర్మ ఏర్పాటు చేసిన నూతన పార్టీ కార్యాలయం గ్రామస్థాయి కార్యకర్తలకు ఒక వేదికగా నిలిచి పార్టీ కార్యక్రమాల నిర్వహణకు కేంద్రంగా ఉపయోగపడుతుందని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అశోక్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు తాడి నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షులు సాగిరాజు సూరిబాబు రాజుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సమస్యలపై చిత్తశుద్ధి ఏది...

### ప్రజా దర్బార్ కు వెళితేనే సమస్యలు పరిష్కారం అంటూ విమర్శలు

సామర్లకోట, ఆగస్టు 30, జి ఎస్ బి వార్త : సామర్లకోట మున్సిపల్ అధికారులకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చిత్తశుద్ధి ఉండటం లేదు. పట్టణంలో పలు సమస్యలు తాండవిస్తున్నా కేవలం ఎమ్మెల్యే ప్రజా దర్బార్ కు వెళ్లిన ఫిర్యాదులకు సంబంధించిన సమస్యలపై మాత్రమే అధికారులు దృష్టి పెడుతున్నారు. మిగిలిన సమస్యలను గాలికి వదిలిపెడుతున్నారు. సమస్య తీవ్రత ఎంత ఉన్న అవి అధికారుల దృష్టికి వెళ్లకపోవడం విచారకరం అని ప్రజలు విమర్శిస్తున్నారు. సామర్లకోట - పిఠాపురం ప్రధాన రహదారికి సంబంధించి పెద్ద బజార్ సెంటర్ వద్ద కల్వర్టు ప్రమాదకరం ఉండడంతో పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల మేజర్ డ్రైన్ కల్వర్టు వద్ద త్రాగునీటి పైప్ లైన్ పనులు చేపట్టడం కోసం ఇరువైపుల గోతులు తీసి పనులు నిర్వహించారు. ఆ సమయంలో కల్వర్టు పై ఉన్న రోడ్డు కుంగిపోగా, ఇరుకు రోడ్డు కావడంతో దానిపైనుంచి పలు బారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో కల్వర్ట్ మరింత ప్రమాదకరంగా మారిందని, రాత్రి వేళల్లో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవ్వడం జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ వారు దానిని పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రతి చిన్న సమస్యను ఎమ్మెల్యే స్థాయి ప్రజాప్రతినిధులు గుర్తించి వాటిపై ఆదేశాలు చేయడం వరకు వదిలి పెట్టకుండా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇలాంటి అనేక సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

RNI AP BIL14872/2024
వార్త
గోదావరి స్పెషల్ బులిటెన్
31-08-2026

# పని దినాల్లో మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి



అమలాపురం (జిఎస్ బి వార్త) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు (SGSW) కార్యాలయాలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రా+=వా) సేవలను అన్ని పని దినాల్లో మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల, ఐ.ఏ.ఎస్. అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా, సులభంగా అందించడంలో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులతో సచివాలయాలకు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి, వారి ఫిర్యాదులను స్వీకరించి సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా స్పెసిఫిక్ ఫంక్షనరీస్ అయిన వ్యవసాయ సహాయకులు, సర్వే సహాయకులు, రెవెన్యూ సహాయకులు, అనిమల్ హస్బెండరీ సహాయకులు, ఇంజినీరింగ్ సహాయకులు తదితర సిబ్బంది తమ తమ స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు కార్యాలయాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి విధులకు హాజరైనప్పటికీ, నిర్ణీత సమయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి అవసరమైన సేవలు అందేలా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇతర అధికారిక విధులకు డెప్యుటేషన్‌పై వెళ్లిన సిబ్బందికి ఈ ఆదేశాలు వర్తించవని తెలిపారు. ప్రజల ఫిర్యాదులను స్వీకరించడం, వాటిని సత్వరంగా పరిష్కరించడం, అవసరమైన పౌర సేవలను అందించడం ప్రతి సంబంధిత ఉద్యోగి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు ఈ ఆదేశాలను కచ్చితంగా అమలు చేసి, PGRS సేవలు ఎటువంటి అంతరాయం లేకుండా అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన, సత్వరమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా ప్రతి సచివాలయ ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల, ఐ.ఏ.ఎస్. కోరారు.

# వైభవంగా శ్రీసత్యదేవుని రధసేవ



అన్నవరం,(జి ఎస్ బి వార్త),ఆగష్టు - 30 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆదివారం సందర్భంగా శ్రీ సత్యదేవుడు, అమ్మవారు రధవాహనంపై ఆలయ ప్రాకారం చుట్టూ వైభవంగా ఊరేగారు. ఉదయం ఆలయ అర్చకులు శ్రీస్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పములతో అలంకరించి రధ వాహనంపై ఆశీనులు గావించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారం చుట్టూ ముమ్మార్లు ఊరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని దేవస్థానం ఏఈఓ భాస్కర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తుల నడుమ ప్రాకార సేవ ఆద్యంతం వైభవంగా సాగింది.కార్యక్రమంలో అర్చకులు,వేధపండితులు,దేవస్థానం అధికారులు,సిబ్బంది,వ్రత పురోహితులు,భక్తులు,గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి...

### ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్ రాజ్



సామర్లకోట ఆగస్టు 30, జి ఎస్ బి వార్త : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలపై స్పందించి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వి నవీన్ రాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దాపురం పట్టణంలోని రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ నందు జరిగిన పెద్దాపురం నియోజకవర్గ కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల దివంగతులైన ఆర్ టివి రిపోర్టర్ సుబ్రహ్మణ్యంకు నివాళి అర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఇళ్ళ స్థలాల సమస్య తోపాటు, సీనియర్ పాత్రికేయులకు పెన్షన్ సదుపాయం, హెల్త్ కార్డుల మంజూరు వంటి అనేక సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్నాయని వాటిని సత్వరం ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్టు చల్లా విశ్వనాధం (ప్రజాశక్తి), అధ్యక్షులుగా ఎస్. లోవ రెడ్డి (టివి 5), కార్యదర్శిగా ఎం. సత్తిరాజు (రాజముద్ర), ఉపాధ్యక్షులుగా పి. రామలక్ష్మణ రావు, సహాయ కార్యదర్శులుగా ఎల్. అశోక్ కుమార్, ఆర్. రాజేంద్ర ప్రసాద్, కోశాధికారిగా అలమండ ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా ఎం. దుర్గా ప్రసాద్, సిహెచ్ మహేష్, పి. రమేష్ లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎపిడబ్ల్యు జెఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు అధికారి, షేక్ మున్నీ, సంఘ పెద్దాపురం నియోజకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# అన్నవరంలో సుమారు రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

### కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన కూటమి నేతలు

అన్నవరం, (జి ఎస్ బి వార్త), ఆగష్టు - 30 : కాకినాడ జిల్లా అన్నవరం గ్రామంలో 20 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు ఆదివారం స్థానిక కూటమి నాయకులు శ్రీకారం చుట్టారు. కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కు డా) నిధులతో 3 సీసీ రోడ్లు మరియు సీసీ డ్రైనేజీల నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా శంఖవరం మండలం మాజీ వైస్ ఎంపీపీ బొమ్మిడి సత్యనారాయణ మాట్లాడుతూ,ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా ఆదేశాల మేరకు, ఈరోజు అన్నవరం గ్రామంలో కూటమి నాయకులు అందరూ కలిసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ అభివృద్ధి పనులతో గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు తీరనున్నట్లు పేర్కొన్నారు.ప్రజలకు మౌళిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రధానంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నిరంతరం శ్రమిస్తున్నారని,"నియోజకవర్గం అభివృద్ధే ఆమె ఆశయంగా ప్రజలకు ఉత్తమ పాలన అందజేస్తున్నారన్నారు". కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వీర్ల సూరిబాబు, మెరపల నరసయ్య, రాజాల చిట్టిబాబు,బండారు రాంబాబు,మద్దు వీరబాబు, పసుపులేటి చక్రి, పలివెల సతీష్,బండారు సురేష్,దాసరి శంకర్, కడుపుకుట్ల కృష్ణ, గంగ్రెడ్డి రమణ, సిద్దె భాస్కర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# గ్రాడ్యుయేట్ యూత్ జనరల్ స్టడీస్ కాంపిటీటివ్ టెస్ట్ --2 విజేత లకు బహుమతులు

### సెప్టెంబర్ 6న రచయితలు--రచనలు, బిరుదులు" అంశంపై కాంపిటేటివ్ టెస్ట్



కరప (జిఎస్ బి వార్త) : కరప మండలం వేళంగి లో ఆదివారం వేళంగి గ్రాడ్యుయేట్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ స్టడీస్ కాంపిటీటివ్ టెస్ట్ --2 విజయవంతంగా జరిగింది. విటమిన్లపై నిర్వహించిన ఈ కాంపిటేటివ్ టెస్ట్లో సుమారు 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టెస్ట్‌లో 60 బిట్స్‌కు ఒక గంట సమయం కేటాయించారు. విద్యార్థులు ఆసక్తిగా పరీక్షలో పాల్గొన్నారు. టెస్ట్ అనంతరం ప్రతిభ కనబరిచిన టాప్--5 విద్యార్థులకు ప్రైజ్‌లు, సర్టిఫికెట్లు అందించారు.టాప్--5 విజేతలు మొదటి బహుమతి ఎం . సంతోష్ --మెర్లాస్ జిల్లా పరిషత్ హై స్కూల్, వేళంగికు, 2వ బహుమతి ఎం . మనోజ్ఞ యాండమూరు హైస్కూల్కు ,3వ బహుమతి సి హెచ్ యశస్విని -- మెర్లాస్ జిల్లా పరిషత్ స్కూల్ వేళంగి కు , 4వ బహుమతి: జె . మణిదీప్ -- స్కూల్, వేళంగి కు , 5వ బహుమతి :పి శివభాస్కర్ నారాయణ స్కూల్ విద్యార్థులు కు కై వసం చేసుకున్నారు. పేపర్ ప్రింట్స్ స్పాన్సర్ దూళ్ల వీరేంద్ర విద్యార్థులకు బహుమతులు అందించారు.గ్రాడ్యుయేట్ యువత గునేశ్వరావు ,వనుం నాగ ప్రసాద్ , కంచి తేజగణేష్,తోలుమ్ గంగరాజు , కట్టా ప్రసన్న కుమార్ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు, యువతలో జనరల్ స్టడీస్‌పై ఆసక్తిని పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన పరిజ్ఞానాన్ని పెంచే లక్ష్యంతో ఈ కాంపిటేటివ్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నట్లు వీజె వై ప్రతినిధులు తెలిపారు. ప్రతి రెండో శనివారం,ఆదివారం విజేవై ఆధ్వర్యంలో జనరల్ స్టడీస్ కాంపిటీటివ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తదుపరి ఆదివారం "రచయితలు--రచనలు, బిరుదులు" అంశంపై కాంపిటేటివ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వేళంగి గ్రాడ్యుయేట్స్ యూత్ ప్రతినిధులు దేగల శ్రీనివాస్, చప్పిడి నరసింహమూర్తి, షేక్ లాలిబాబు, పట్టా రాజశేఖర్ బాబు,సిద్ధబత్తుల అర్జున్ రావు,ఎర్ర విక్రమ్ పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవిజయదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

### భారీ ఎత్తున అన్నదానం



అన్నవరం, (జి ఎస్ బి వార్త), ఆగష్టు - 30 : కాకినాడ జిల్లా శంఖవరం నందు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్ ఆద్వర్యంలో శ్రీ విజయదుర్గమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. శంఖవరంలోని కృష్ణాలయం వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయం నందు ఆదివారం శ్రీ విజయదుర్గమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాన్ని వివిధ సుగంధ పుష్పమాలికలతో రమణీయంగా తీర్చిదిద్దారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, విశేష పదార్ధాలు అమ్మవారికి నివేదించారు.కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ విచ్చేసి అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే తోపాటు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త యాళ్ళ జగదీష్, అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవి రోహిత్, అన్నవరం తెలుగుదేశం పార్టీ నాయకులు బొమ్మిడి సత్యనారాయణ, వీర్ల సూరిబాబు, రాజాల చిట్టిబాబు, మద్దు వీరబాబు తదితరులు పాల్గొని విజయదుర్గమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాదిగా జనం తరలివచ్చి అమ్మవారిని దర్శించి, అన్న ప్రసాదం స్వీకరించారు.

# తూర్పుగోదావరి డీపీఆర్ఓ పెద్దింటి రవి పదవీ విరమణ ఆత్మీయ సమ్మేళనం



కాకినాడ, (జిఎస్ బి వార్త ప్రతినిధి ) : కాకినాడ జిల్లా లో సుదీర్ఘకాలం సేవలందించి

తూర్పుగోదావరి జిల్లా పౌర సంబంధాల అధికారి డీపీఆర్వో గా పనిచేస్తు ఆగస్టు 31న పదవీ విరమణ చేయనున్న పెద్దింటి రవి పదవీ విరమణ ఆత్మీయ సమ్మేళన ఘనంగా నిర్వహించారు. ఆదివారం కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ ఎదురుగా హోటల్ బ్లూమ్ లో సమాచార పౌర సంబంధాల శాఖ జోన్-2 జాయింట్ డైరెక్టర్ (ఆర్జెడి) టి. తిమ్మప్ప,కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారులు బి.పద్మజ, లక్ష్మీనారాయణ, సీనియర్ పాత్రికేయులు టి. మధుసూదన రావు, సమాచార శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) డి. నాగార్జున ముఖ్య అతిథులు గా పాల్గొన్నారు . ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పాత్రికేయ సోదరులు, సమాచార శాఖలో వివిధ జిల్లాల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులు, ప్రస్తుతం పని చేస్తున్న అధికారులు సిబ్బంది, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హాజరై పెద్దింటి రవి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ జోన్ 2 ఆర్జేడీ తిమ్మప్ప మాట్లాడుతూ సమాచార పౌర సంబంధాల శాఖలో 39 సంవత్సరాల 6 నెలల సుదీర్ఘ కాలం పాటు పి.రవి వివిధ హోదాల్లో బాధ్యతాయుతంగా పనిచేస్తూ అందించిన విశేష సేవలను కొనియాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు మీడియా సమన్వయం లో ఆయన చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళన వేడుకలో భాగంగా ఆర్జేడీ టి. తిమ్మప్ప ఇతర అతిథులు పెద్దింటి రవి దంపతులను శాలువా కప్పి, పూల బొకేతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోను ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తన ఉద్యోగ ప్రస్థానంలో అండగా నిలిచి ఆదరించి ప్రోత్సహించిన ఉన్నతాధికారులకు, సహాయ సహకారాలు అందించినసహోద్యోగులకు, మీడియా మిత్రులకు, కష్టసుఖాల్లో వెన్నంటి నిలిచిన కుటుంబ సభ్యులకు,బంధు మిత్రులకుశ్రేయోభిలాషులందరికి పి. రవి తన కృతజ్ఞతలు తెలిపారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ పెద్దాపురం నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

పెద్దాపురం (జిఎస్ బి వార్త) : కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గ ఏపీడబ్ల్యూజేఎఫ్ సమావేశం ఆదివారం పెద్దాపురం బ్యాంక్ కాలనీ చాచా స్కూల్ ఆవరణలో ఎస్.ఎల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కాకినాడ జిల్లా అధ్యక్షులు వాతాడ నవీన్ రాజ్, కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్, రాష్ట్ర బాధ్యులు ఎండి అధికార్, ఎస్.కె మున్ని హాజరయ్యారు. పెద్దాపురం నియోజకవర్గ కార్యక్రమాలు జమా ఖర్చులపై సుదీర్ఘ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా వాతాడ నవీన్ రాజ్ మాట్లాడుతూ పెద్దాపురం డివిజన్ సంబంధించి పూర్వవైభవం తీసుకొచ్చే విధంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ కు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఎవరు ఎటువంటి మనస్పర్ధలు పెట్టుకోకుండా గతంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్లో ఎంత బలంగా ఉండేదే మరల అదే విధంగా ఉ ఒడేందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా కృషి చేయాలన్నారు. కరోనా తర్వాత అన్ని నియోజకవర్గాలలో కార్యకలాపాలు తగ్గించాలని మరల ఏపీడబ్ల్యూజేఎఫ్ కు కాకినాడ జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో నూతన కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సభకు హాజరైన సభ్యులందరూ మరొక్కసారి ఎస్ఎల్ రెడ్డి ని అధ్యక్షులుగా, సత్తిరాజు ప్రధాన కార్యదర్శిగా, అలమండ ప్రసాద్ ట్రెజరర్ గా, ఉపాధ్యక్షులుగా రామలక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీగా అశోక్, రాజేంద్ర, సభ్యులుగా పి మహేష్, దుర్గాప్రసాద్, ఎం మహేష్ లను ఎన్నుకున్నారు. ఇటీవల సభ్యుని మరణం పట్ల సభ్యులందరూ మౌనం వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సురేంద్ర, సత్య, పుర్రె త్రినాథ్, కాశీ విశ్వనాథ్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో డ్రోన్ కెమెరాలతో పోలీసుల ప్రత్యేక నిఘా





కాకినాడ, (జిఎస్ బి వార్త ) : ఆదివారం సెలవు రోజు కావడంతో కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం తో తిమ్మాపురం పోలీసులు, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. బీచ్ పరిసరాల్లో ప్రజల రద్దీని పర్యవేక్షిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించారు. ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడంలో భాగంగా డ్రోన్ కెమెరాలను వినియోగించి ఎన్టీఆర్ బీచ్ పరిసర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాల ద్వారా బీచ్‌లోని జనసమ్మర్దం, అనుమానాస్పద కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ, భద్రతా సూచనలు పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గోరంట్ల



రాజమహేంద్రవరం:(జిఎస్ బి వార్త) : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. అదివారం రాజమహేంద్రవరం రూరల్ ఏరియా కడియం మండలం మాధవ రాయుడుపాలెం గ్రామంలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని దశలవారీగా పూర్తి చేస్తూ గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ గ్రామీణ రహదారుల అభివృద్ధి వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు విశేష ఆదరణ చూపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మరిడమ్మ ఆలయంలో భారీ అన్నదానం...

### డిసిసిబి చైర్మన్ ప్రత్యేక పూజలు



పెద్దాపురం, ఆగస్టు 30, జి ఎస్ బి వార్త : ఆషాడ మాసం ముగింపు ఉత్సవాల్లో భాగంగా పెద్దాపురం శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి, వంశపారంపర్య ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో భక్తులకు నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రారంభించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు జరిగిన అన్నదాన కార్యక్రమంలో వేల సంఖ్యలో భక్తులు విచ్చేసి పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత ఆలయంలో ఉదయం మరిడమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనార్థం సిద్ధం చేశారు. ఈ పూజల్లో డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, నాయకులు నూనే రామారావు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొని సేవలు అందజేశారు.



